# ఈసారి బడ్జెట్ ప్రభావం స్వల్పమే



**పోలవరపు జయప్రకాశ్**

**స్టాక్ మార్కెట్**

స్టాక్ మార్కెట్ పరంగా చూస్తే బడ్జెట్‌కు అంతగా ప్రాధాన్యం ఇవ్వనక్కర్లేదు. ఎందుకంటే.. ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు, వృద్ధి అవకాశాలకు అనుగుణంగా ఇది స్పందిస్తూ ఉంటుంది. బాగా పడిపోవడం, మళ్లీ కోలుకొని పెరగడం, మళ్లీ పతనం.. ఇటువంటి ప్రవర్తన సర్వసాధారణం. ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తే బడ్జెట్‌లో చోటుచేసుకునే సానుకూల లేదా వ్యతిరేక ధోరణులను స్టాక్ మార్కెట్ ఇప్పటికే గ్రహించినట్లు కనిపిస్తోంది. అందువల్ల బడ్జెట్ ప్రభావం తాత్కాలికమే కావచ్చు. ఇప్పటికే వచ్చే మూడేళ్ల కాలానికి దీర్ఘకాలిక బుల్ సైకిల్‌లో మార్కెట్ ప్రవేశించింది. నిఫ్టీ సూచీ 2500 పాయింట్ల నుంచి 5300 పాయింట్ల వరకూ పెరిగింది. అక్కడి నుంచి దిద్దుబాటు చోటుచేసుకుంది. ఈ దీర్ఘకాలిక బుల్‌మార్కెట్లో ఇది మొదటి దశ. ఈ మొదటి దశ పూర్తయినట్లు భావించవచ్చు. అందువల్ల స్వల్పకాలంలో దిద్దుబాటుకు గట్టి అవకాశాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు అధికంగా ఉంటే... అత్యంత ఆకర్షణీయంగా బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి రూపొందిస్తే, దిద్దుబాటుకు మరికొంత ఎక్కువ సమయం పట్టవచ్చు. అటువంటి పరిస్థితుల్లో మార్కెట్ మళ్లీ కొంత పెరిగి అక్కడి నుంచి కిందకు వచ్చే అవకాశం ఉంది. ఈ విధంగా జరిగితే నిఫ్టీకి మద్దతు 4600 పాయింట్ల వద్ద కనిపిస్తోంది. అలాకాకుండా బడ్జెట్ అయిన వెంటనే భారీ దిద్దుబాటు వచ్చిన పక్షంలో 4000 పాయింట్ల వరకూ నిఫ్టీ పతనమయ్యే ప్రమాదం ఉంది. ఈ ఏడాది జూన్ లోపే ఇది జరగాలి. వాస్తవానికి దిద్దుబాటు వెంటనే రావడం మదుపుదార్లకు, స్టాక్ మార్కెట్‌కు క్షేమకరం. అది ఆలస్యం అయ్యేకొద్దీ పతనం తీవ్రంగా, అధికంగా ఉండి మదుపుదార్లు బాగా నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఒక రకంగా ఇరుక్కుపోతారనే చెప్పవచ్చు. మొత్తం మీద ఎటుచూసినా దిద్దుబాటు తప్పదనే పరిస్థితి ఉంది. అందువల్ల బడ్జెట్ ప్రతిపాదనల్లోని మంచిచెడ్డలను మార్కెట్‌కు అన్వయించి చూస్తూ షేర్ల క్రయవిక్రయ నిర్ణయాలు తీసుకోవడం కంటే, దీర్ఘకాలిక దృక్పథంతో మార్కెట్‌ను అర్థం చేసుకొని ముందుకు సాగడం మేలు.

( రచయిత ఆర్‌ఎల్‌పీ సెక్యూరిటీస్, డైరెక్టర్ )